క్లుప్తంగా

రాజ్‌గోండ్ సేవ సమితి జిల్లా అధ్యక్షుడిగా శంకర్


శంకర్

బోథ్: మండలంలోని పట్నాపూర్ గ్రామానికి చెందిన అడ్వొకేట్ పంద్రం శంకర్‌ను రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈనెల 27న హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు సమక్షంలో ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయన ఎన్నికపట్ల ఆదివాసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

బోథ్ బ్లాక్ ఆత్మ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం


మునీర్ అహ్మద్‌ను సన్మానిస్తున్న నాయకులు

నేరడిగొండ: మండలకేంద్రానికి చెందిన మునీర్ అహ్మద్ బోథ్ బ్లాక్ ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా నియామకమైన సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. తన నియామకానికి సహకరించిన నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌కు మునీర్ అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు. మజీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఇమ్రాన్, సయ్యద్ అన్వర్, షేక్ కలీం, షేక్ అఫ్సర్, ఖైసర్, షేక్ తలముల్, ఎండీ సద్దాం, సయ్యద్ సబీర్, ఇసాఖ్, జహీర్, ముఖ్తియార్ పాల్గొన్నారు.

నేడు ఆపరేషన్ సిందూర్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ఆదిలాబాద్: జిల్లాలోని 32 టీ బెటాలియన్ ఎన్‌సీసీ కేడేట్స్ ఆపరేషన్స్ సిందూర్‌పై బుధవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహిస్తున్నట్లు కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఏకే కీచర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో 200 మంది సీనియర్ డివిజన్ ఎన్‌సీసీ కేడేట్స్‌కు ప్రజెంటేషన్ కార్యక్రమం ఉంటుందని వివరించారు. మధ్యాహ్నం 12 గంటలకు కార్యక్రమం ప్రారంభమైతుందని ఈ విషయాన్ని కేడేట్స్ గమనించాలని సూచించారు.

ఉపాధ్యాయుల చేయూత

నార్నూర్: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ (సీసీవో)గా విధులు నిర్వహిస్తున్న చౌహాన్ శంకర్ కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఉపాధ్యాయులు, ఎంఈవో పవార్ అనిత ఆధ్వర్యంలో రూ.50 వేల నగదు జమచేసి బాధితుడికి మంగళవారం అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఇషాన్ అండర్–13 రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో ఈనెల 19న నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల హెచ్‌ఎం విజయకుమార్ తెలిపారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, పీఈటీ గౌతంతోపాటు గణేశ్, రాకేశ్, సంజయ్‌లు మంగళవారం ఇషాన్‌ను అభినందించారు.

డిగ్రీ కళాశాలలో పుస్తకావిష్కరణ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీనియర్ వృక్షశాస్త్ర అధ్యాపకులు కీర్తన, వేమగంటి వరప్రసాద్‌రావు రాసిన వివిద పుస్తకాలను మంగళవారం ఆవిష్కరించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు డా వెల్మ మధు, జలగం అనిత, కటకం మురళి, సరస్వతి పాల్గొన్నారు.

బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఖాజా నజాఉద్దీన్‌ను గుర్తుతెలియని ద్విచక్రవాహనదారుడు సోమవారం రాత్రి ఢీకొట్టాడు. దీంతో బాధితుడికి గాయాలయ్యాయి. ఆయన కుమారుడు ఎండీ నిసారొద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

ఇంద్రవెల్లి: అర్హులకే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని కేస్లాగూడ(ఎం) గ్రామస్తులు పేర్కొన్నారు. మండలంలోని కేస్లాపూర్ పంచాయతీ పరిధి కేస్లాగూడ(ఎం) గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకతవకలు జరిగాయని గ్రామస్తులు మంగళవారం ఎంపీడీవో భాస్కర్‌కు విన్నవించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలికలు కరాటే నేర్చుకోవాలి

తలమడుగు: ఆత్మరక్షణ కోసం బాలికలు కరాటే నేర్చుకోవాలని ఎస్సై రాధిక అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం పోలీస్ శాఖ ద్వారా బాలికలకు జ్వాల కార్యక్రమం ద్వారా 10 రోజుల పాటు కరాటే శిక్షణను ప్రారంభించారు. ఈ అవకాశాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హైలెవల్ వంతెన నిర్మాణమెప్పుడో?

- పార్డి(బి)–రామయి మధ్య వంతెన పనులు మొదలయ్యేనా?
- భారీ వర్షాలకు పొంగుతున్న వాగులు
- రోడ్లపై చేరుతున్న వరదనీరు
- రాకపోకలకు అంతరాయం
- వాహనదారుల ఇక్కట్లు


సాత్నాల వాగు దాటుతున్న ప్రజలు

సాత్నాల: వర్షాకాలం వచ్చిందంటే మండలంలోని పార్డి(బి), పార్డి(కే), మేడిగూడ(ఆర్), కంఠ గ్రామాల ప్రజలకు వణుకు మొదలవుతోంది. భారీ వర్షాలకు వాగులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో రోడ్లపై వరదనీరు చేరుతోంది. దీంతో రాకపోకలు అంతరాయం కలుగుతోంది. దీంతో వాహనదారులు, పాదాచారులు, ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రజలు వాగు దాటుతున్నారు. భారీ వర్షాలకు తాత్కాలికంగా నిర్మించుకున్న వంతెన కొట్టుకుపోవడంతో బాహ్య గ్రామాలకు సంబంధాలు తెగిపోతున్నాయి. కంఠ, ఉప్పల్‌గావ్ గ్రామాల రైతులు కామాయి గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు అనుసంధానం ఉంది. వర్షాకాలంలో రైతులు బ్యాంకు వరకు రావడానికి అవస్థలు పడుతున్నారు. పార్డి(బి) నుంచి రామయి మధ్య హైలెవల్ వంతెన నిర్మాణం లేకపోవడంతో ఆ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామాల ప్రజలు జిల్లాకేంద్రానికి చేరుకోవాలంటే దూరభారం అవుతోంది. వంతెన నిర్మిస్తే పార్డి(బి), పార్డి(కే), మేడిగూడ(ఆర్), కంఠ గ్రామాలతోపాటు అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు రామాయి నుంచి జిల్లాకేంద్రానికి 18 కి.మీ దూరాన చేరుకోవచ్చు. వంతెన లేకపోతే మేడిగూడ (ఆర్), సాత్నాల, రామాయి చేరుకుని అక్కడినుంచి ఆదిలాబాద్ చేరాలంటే అదనంగా 7 కి.మీ దూరభారం ప్రయాణించాల్సి వస్తుంది.


గతంలో వేసిన శిలాఫలకం

దుబ్బగూడకు నిధులు మళ్లింపు!

2019లో ఎస్‌టీఎఫ్‌డీఎఫ్ నిధులు రూ.3 కోట్లతో పార్డి(బి) నుంచి రామయి మధ్య హైలెవెల్ వంతెన నిర్మాణ కోసం ఎమ్మెల్యే జోగు రామన్న శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇప్పటివరకు పనులు మొదలు కాలేదు. తమకు ఆ ప్రాంతంలో ఓట్లు తక్కువ వచ్చాయని ఈ నిధులను దుబ్బగూడకు మళ్లించినట్లు వినికిడి.

ఇబ్బందిగా ఉంది

హైలెవల్ వంతెన నిర్మాణం లేక ఇబ్బందిగా ఉంది. పిల్లలను ఇతర గ్రామాల్లో పాఠశాలలకు పంపాలంటే కష్టమవుతుంది. వర్షాలకు వాగులు పొంగుతున్నాయి. అధికారులు స్పందించి హైలెవల్ వంతెన నిర్మించేలా చర్యలు చేపట్టాలి. – గట్టి కొప్పుల పోశెట్టి, పార్డి(బి)

పట్టించుకోవడం లేదు

హైలెవల్ వంతెన నిర్మించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడంలేదు. రోగులు, గర్భిణులను ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే వాగు దాటించాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలి. – సతీశ్, పార్డి(బి) 22ఏడీఐ 304

నార్నూర్‌లో టెలీ మెడిసిన్ క్లినిక్

- త్వరలో అందుబాటులోకి అధునాతన వైద్యసేవలు
- కలెక్టర్ చొరవతో చర్యలు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించేందకు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. కలెక్టర్ రాజర్షి షా చొరవతో అధునాతన వైద్యసేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. మండల కేంద్రంలోని పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనంలో స్వశోధన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టెలీ మెడిసిన్ క్లినిక్ ఏర్పాటుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాలకు మల్టీ స్పెషాలిటీ వైద్యసేవలు అందించనున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాథోడ్ నరేందర్ పర్యవేక్షణలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయని సీహెచ్‌సీ వైద్యాధికారి జితేందర్ రెడ్డి తెలిపారు. అధునాతన డిజిటల్ నిర్ధారణ పరికరాలు, స్టెతస్కోప్, 12 లీడ్, 6 లీడ్ ఈసీజీ యంత్రాలు, ఓటోస్కోప్, ఎక్సరే యంత్రం, హిమోగ్లోబిన్, రక్తపరీక్ష పరికరాలు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు.


స్వశోధన్ టెలీ మెడిసిన్ క్లినిక్ ఏర్పాటు చేయనున్న పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం

నిపుణులతో వైద్యసేవలు

స్వశోధన్ ట్రస్ట్ టెలీ మెడిసిన్ ద్వారా హృదయ నిపుణులు అమెరికా నుంచి, స్త్రీలు రోగ నిపుణులు అమెరికా, భారత్, చర్మ రోగ నిపుణులు, జనరల్ ఫిజీషియన్లతోపాటు ఉన్నత టెలీ ఆరోగ్య, వెల్‌నస్ సేవలు, గైనకాలజీ, డెర్మటాలజీ, యోగా, ఎడ్యుకేషన్, డిజిటల్ ఆరోగ్య అవగాహన వైద్య సేవలు అందించనున్నారు.

అచ్యుతానందన్ ఆశయసాధనకు కృషి

ఆదిలాబాద్‌అర్బన్: కమ్యూనిస్టు దిగ్గజం, కేరళ మాజీ సీఎం వీఎస్ అచ్యుతానందన్ (102) ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి, జిల్లా కార్యదర్శి మల్లేశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయం, సుందరయ్య భవనంలో అచ్యుతానందన్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అచ్యుతానందన్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అన్నమొల్ల కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, మంజుల, నాయకులు ఆశన్న, పండుగ పొచ్చన్న, గంగాసాగర్, అరఫా బేగం తదితరులు పాల్గొన్నారు.


సంస్మరణ సభలో పాల్గొన్న సీపీఎం నాయకులు

జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: జాతీయస్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఉట్నూర్‌లోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. పెద్మకి ప్రమోద్, కిరణ్, సాయిరాం, ఆత్రం జగ్జీవన్‌లను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మంగళవారం సన్మానించారు. వీరు ఈనెల 23 నుంచి హైదరాబాద్‌లో జరిగే శిక్షణ శిబిరంలో పాల్గొన్న అనంతరం ఈనెల 28 నుంచి ఆగస్టు 8 వరకు చెన్నైలో జరిగే జాతీయ సబ్‌జూనియర్ హాకీ పోటీల్లో పాల్గొననున్నారు. ఈఈ తానాజీ, జిల్లా గిరిజన క్రీడల అదికార పార్థసారథి, హేమంత్, శేఖర్ తదితరులు ఉన్నారు.

గిరిజన క్రీడా పాఠశాలల్లో ప్రవేశ ఎంపిక పోటీలు

గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలల్లో ప్రవేశం కోసం మంగళవారం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ మైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి ఈ పోటీలను ప్రారంభించారు. రెండో రోజైన బుధవారం జాతర్లలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో బాలురకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు శరీర ధారుడ్య పరీక్షలు నిర్వహించారు. హెచ్‌ఎం ఉత్తం, పీడీ హేమం, గంగారాం, రవీందర్, శివ కృష్ణ తదితరులు ఉన్నారు.

మహిళా సంఘాలకు సోలార్ పవర్

- తలమడుగు మండలంలో ఏర్పాటుకు ప్రణాళికలు పూర్తి
- కజర్లలో ప్రభుత్వ భూమి పరిశీలించిన అధికారులు

తలమడుగు: ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించి వారిని వ్యాపారవేత్తలుగా ఆర్థికంగా బలపేతం చేసేందుకు ప్రభుత్వం పలు ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. మహిళల భాగస్వామ్యంతో సోలార్ ప్లాంట్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తలమడుగు మండలం కజ్జర్ల గ్రామంలోని సబ్ స్టేషన్ సమీప పరిధిలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ప్రభుత్వ భూమిని డీఆర్డీఏ అధికారులు పరిశీలించారు. వీటి స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వమే భూమిని సమకూర్చి రుణ సదుపాయం కల్పించనుంది. ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్ నిర్మాణానికి నాలుగెకరాల భూమి అవసరం కాగా, ఈ ప్లాంట్ ఏర్పాటు కోసం దాదాపు రూ.3 కోట్ల నుంచి 4 కోట్ల వరకు వ్యయం అవుతుందని అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఈ ప్లాంట్ ఏర్పాటుకు ఆర్థికసాయం కోసం బ్యాంకులు డీఆర్డీఏ మూలధనం ప్రాజెక్టు వ్యయానికి అందించడానికి సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. 10% వాటాదనం మహిళా సంఘాలు మహిళ సమైక్యలు సమకూర్చుకోవాల్సి ఉంటుంది.

ప్రభుత్వ భూమి పరిశీలన

మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వ భూములను డీఆర్‌డీఏ, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. మండలంలోని కజ్జర గ్రామ సమీపంలో నాలుగెకరాల ప్రభుత్వ భూమిని సబ్‌స్టేషన్ సమీపంలో గుర్తించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు డీఆర్డీ అధికారులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో స్థానిక మహిళలతో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

ఒక యూనిట్ రూ.3.13తో కొనుగోలు

సోలార్ ప్రాజెక్టు ద్వారా విద్యుత్ కొనుగోలు టీజీ రెడ్కో ఈఆర్‌సీతో ఒప్పందాలు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం విద్యుత్ సంస్థలు యూనిట్‌ను రూ.3.13లకు కొనుగోలు చేస్తోంది. సగటున రోజుకు 4 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. దీంతో నెలకు లక్ష ఇరవై వేల యూనిట్ ఉత్పత్తి అవుతుంది. వీటి నిర్వహణ వ్యయం పోను ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్ ప్రాజెక్టు ద్వారా రూ.2.16 లక్షల ఆదాయం వస్తుంది. ఏడాదికి రూ.25.92 లక్షల వరకు ఆదాయం వస్తుందని డీఆర్డీఏ అధికారులు ప్రణాళిక రూపొందించారు. 25 ఏళ్ల వరకు సోలార్ పావర్ ప్లాంట్ ద్వారా వస్తుంది. తలమడుగు మండలంలో మహిళా సంఘాల సభ్యులు సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు మహిళా సంఘాల ప్రతినిధులు ఆసక్తి చూపుతున్నారు. త్వరలో ఏర్పాటు చేయాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధం

తలమడుగు మండలంలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు వనరులు ఉన్నాయి. స్థానిక మహిళా సంఘాల నుంచి కూడా సుముఖత వ్యక్తమవుతోంది. కజ్జర్లలో ప్రభుత్వ భూమిని ఏర్పాటుకు నాలుగెకరాల భూమిని పరిశీలించాం. పూర్తి వివరాలను జిల్లా అధికారులకు పంపించాం. – శేఖర్, ఏపీఎం, తలమడుగు

ఉపాధి అవకాశాలు కల్పించాలి

మహిళా సంఘాలకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించాలి. దీంతో ఆర్థికంగా పురోగతి సాధించవచ్చు. రెండున్నర దశాబ్దాలుగా బ్యాంకుల ద్వారా మహిళలు రుణాలు తీసుకుంటూ సక్రమంగా చెల్లిస్తున్నారు. దీంతో మహిళలు సంఘాలు రుణాలు అందించేందుకు బ్యాంకులు ప్రభుత్వ సంస్థలు ముందుకు రావాలి.
– ప్రమీల, మండల సమైక్య సంఘం అధ్యక్షురాలు

దాశరథి శతజయంతి


నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్లు

ఆదిలాబాద్‌టౌన్: నిజాంకు వ్యతిరేకంగా పోరాడి ప్రజలను చైతన్యపర్చిన మహాకవి దాశరథి అని ఆదిలాబాద్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.సంగీత అన్నారు. మంగళవారం కళాశాలలో దాశరథి కృష్ణమాచార్యులు శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. దాశరథి సాహిత్యాన్ని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో లెక్చరర్లు ఆర్.సంతోష్‌కుమార్, చక్రవర్తి, శ్రావణి, శ్రీధరదేవి, ఆనంద్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

సాత్నాల: వచ్చే స్థానికసంస్థల ఎన్నికలకు పార్టీ నాయకులు సిద్ధంగా కావాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. భోరజ్ మండలం పుసాయి గ్రామంలో నిర్వహించిన పార్టీ వర్క్‌షాప్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ హయాంలో, ప్రస్తుత రేవంత్ సర్కారు పాలనలో ప్రజలకు చేసిందేమి ఆరోపించారు. అనంతరం పెండల్‌వాడ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీలో చేరారు.

భీంపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని జిల్లాధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యశాలలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

బోథ్: స్థానిక ఎన్నికల్లో బీజేపీదే విజయమని పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ పేర్కొన్నారు. మండలంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కార్యశాల నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండల అధ్యక్షులు రవీందర్, ప్రధాన కార్యదర్శి రోహిత్ పాల్గొన్నారు.

ముగిసిన జవాన్ అంత్యక్రియలు


అకాశ్ అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రజలు

బజార్‌హత్నూర్/ఇచ్చోడ: బజార్‌హత్నూర్ మండలం వర్తమన్నూర్‌కు చెందిన నలువల అకాశ్ అస్సాం రాష్ట్రం డీపు అస్సాం రైఫిల్ రెజిమెంట్ క్యాంపులో అకస్మాత్తుగా మృతి చెందాడు. మంగళవారం ఆకాశ్ పార్థివదేహం ఇచ్చోడకు చేరుకుంది. అక్కడ నుంచి వర్తమన్నూర్ వరకు ర్యాలీగా తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం అశ్రునయనాల మధ్య నిర్వహించిన అంత్యక్రియలు ముగిసింది. ఈ అంత్యక్రియల్లో పాల్గొన్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ బాధిత కుటుంబ సభ్యులకు రూ.50వేలు నగదు అందజేశారు. వారికి అండగా ఉంటామన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్, మండల ప్రజలు పాల్గొన్నారు.

బంగారుగూడ కేజీబీవీ సందర్శన

కైలాస్‌నగర్: పట్టణంలోని బంగారిగూడలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మున్సిపల్ ఇంజినీర్ పేరిరాజు మంగళవారం సందర్శించారు. పాఠశాల ఆవరణలోకి చేరుతున్న మురుగునీరును పరిశీలించారు. పాఠశాలకు సమీపంలో బహిరంగ మలవిసర్జన జరుగుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లుగా గుర్తించామన్నారు. ఈ సమస్య పరిష్కారానికి త్వరలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పట్టణంలో పిట్టలవాడ నుంచి కేఆర్‌కే కాలనీ వరకు కొత్తగా చేపట్టిన బీటీ రోడ్డు పనులు, వర్షాల కారణంగా రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను పరిశీలించారు.

ఐదుగురిపై చీటింగ్ కేసు

ఇంద్రవెల్లి: యువతిని చూపిస్తానని మాయమాటలు చెప్పి మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తి నుంచి డబ్బులు తీసుకుని మోసం చేసిన ఐదుగురిపై మంగళవారం చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇ.సాయన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన రాత్‌వై గ్రామానికి చెందిన జిరాతి రామ్‌దయల్ భార్య నాలుగు నెలల క్రితం మృతిచెందింది. తన ఇద్దరు పిల్లలు చూసుకునేందుకు ఇబ్బంది ఉందని తనకు తెలిసిన జాట్ రాజేష్‌కు చెప్పాడు. అతనికి మహారాష్ట్ర వాణికు చెందిన గుర్తుతెలియని వ్యక్తి ఫోన్‌చేసి తన వద్ద యువతి ఉంది. రాజేష్ ఈ విషయాన్ని రామ్‌దయల్‌కు చెప్పి అతని ఫొటోను గుర్తు తెలియని వ్యక్తికి వాట్సాప్‌లో పంపించాడు. పెళ్లి విషయం మాట్లాడడానికి ఈనెల 20న జాట్ రాజేష్, జాట్ అనిల్‌తో కలిసి టవేర వాహనంలో వాణికి వెళ్లి తమకు ఫోన్ చేసిన వ్యక్తిని ఎక్కించుకొని ఆదిలాబాద్ చేరుకున్నారు. ఇక్కడ తమకు తెలిసిన రాజును వాహనంలో ఎక్కించుకుని సాయంత్రం ఇంద్రవెల్లికి చేరుకున్నారు. ఇంద్రవెల్లికి చెందిన వెంకటి..రామ్‌దయల్‌ను పెళ్లి చేసుకునే భాను బి, సాబేరాబిని చూపెట్టి ఆటోలో ఎక్కుంచుకొని ఇంటికి తీసుకొచ్చారు. యువతులను చూపెట్టినందుకు రూ.లక్ష ఇవ్వాలనగా ఇచ్చాడు. ఇప్పుడే వస్తామని చెప్పి గుర్తుతెలియని వ్యక్తి, భానుబి, సాబేరిబి పారిపోయారు. రామ్‌దయల్ ఫిర్యాదుతో వాణికి చెందిన వ్యక్తితోపాటు రాజు, వెంకటి, భానుబి, సాబేరిబిలపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోగుల వివరాలు నమోదు చేయాలి

ఇంద్రవెల్లి: ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ఎన్‌సీడీ స్క్రీనింగ్ యాప్‌లో రోగుల పూర్తి వివరాలు నమోదు చేయాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శ్రీధర్ మెట్పల్లివార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్న ఎన్‌సీడీ యాప్, డిజిటల్ హెల్త్‌కార్డు కార్యక్రమంపై మండలంలోని ఈశ్వర్‌నగర్‌లో మంగళవారం ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 27 పీహెచ్‌సీల పరిధిలో ప్రతి ఆస్పత్రికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి నూతన ఎన్‌సీడీ స్క్రీనింగ్ యాప్ ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపిక చేసిన గ్రామంలో మూడు రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించి స్క్రీనింగ్ యాప్‌లో బీపీ, షుగర్, మానసిక ఆరోగ్యం, పాలిమేటివ్ కేర్, వృద్ధాప్య సంబంధిత సమస్యలు, మూడు రకాల క్యాన్సర్ వ్యాధిపై పూర్తిస్థాయిలో పరీక్షలు ఉంటాయన్నారు. ఆన్‌లైన్‌లో ప్రతి వ్యక్తి సమాచారం నమోదు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

సంక్షిప్త వార్తలు

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

గుడిహత్నూర్: మండలంలోని శాంతాపూర్ మాజీ సర్పంచ్ సిడాం సోనేరావ్ (85) అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందారు. గతంలో నాలుగు పర్యాయాలు సర్పంచ్‌గా ఆయన సేవలందించారు. దీంతో పలువురు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో మాజీ ఏఎంసీ చైర్మన్ తిరుమల్ గౌడ్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి, వెడ్మ బొజ్జు చిత్రపటానికి క్షీరాభిషేకం

ఇంద్రవెల్లి: జీవో 49ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడం హర్షనీయమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం అన్నారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎండీ జహీర్, నాగ్‌నాథ్, సుద్దోధన్ వాగ్మరే, జితేందర్, ఎండీ జునైద్, రాందాస్, దిలీప్, రాజేశ్వర్, సునీల్, మారుతి, భీంరావ్ తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో బోనాల సంబరాలు

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) ప్రాథమిక, సొనాల మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలల్లో బోనాల పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి అమ్మవారికి పూజలు చేశారు.

నాటు సారా అమ్మితే కఠిన చర్యలు

భీంపూర్: నాటుసారా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై పీర్‌సింగ్ నాయక్ హెచ్చరించారు. మండలంలోని వడూర్ గ్రామంలో దేశీదారు అమ్ముతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన గోధుబాయి, దేవ్‌రావ్ వద్ద దేశీదారు సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ముందస్తుగా కేటీఆర్ జన్మదిన వేడుకలు


కేటీఆర్ చిత్రపటానికి పూలు జల్లుతున్న గ్రామస్తులు

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కే)లో మంగళవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముందుస్తు జన్మదిన వేడుకలను గ్రామస్తులు నిర్వహించారు. పంట పొలాల్లో కేటీఆర్ చిత్రపటానికి పుష్పాభిషేకం చేశారు. మాజీ సర్పంచ్ గాడ్గేమీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తుల్జాపూర్ భవాని ఆలయంలో పూజలు

నేరడిగొండ: మహారాష్ట్రలో తుల్జాపూర్‌లో తుల్జాభవాని ఆలయాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈనెల 26న తాను నిర్వహించే జాబ్‌మేళాలో నిరుద్యోగ యువత ఉద్యోగాలు సాధించి ఉపాధి పొందాలన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు

నార్నూర్: ఉద్యోగాలు ఇప్పిస్తామని అమాయక ప్రజల వద్ద డబ్బులు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ప్రభాకర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. గాదిగూడ మండలానికి చెందిన బాధితుడు భీంరావు ఫిర్యాదుతో నాంపల్లి సంతోష్ ఆదిలాబాద్ ఎమ్మెల్యే మనిషి అని చెప్పి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి ఏడాది క్రితం రూ.50 వేలు వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా శీత్లా పండుగ

నేరడిగొండ: మండలంలోని బంధంరేగడి, బొందిడి గ్రామాల్లో శీత్లా పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. బంజారాలు తమ సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని లంబాడితండాల్లో వర్షాలు కురిసి, పంటలు పండాలని వేడుకున్నారు.

ఆర్డీవోకు సన్మానం

కైలాస్‌నగర్: ఇటీవల ఆదిలాబాద్ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన బి.స్రవంతిని సనాతన హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలిసి శాలువతో సత్కరించారు. సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రీ, గౌరవ అధ్యక్షుడు బండారి వామన్, ఉపాధ్యక్షుడు రవీందర్, మహిళా విభాగం అధ్యక్షురాలు శశికళ, సభ్యులు నర్సింలు, సంతోష్ అగర్వాల్, రవీందర్, స్వామి, దశరథ్ ఉన్నారు.

గిరిజాయిమాతకు పూజలు

భీంపూర్: మండలంలోని గొల్లఘాట్ తాంసి సమీపంలోని గిరిజాయిమాతకు భక్తులు మంగళవారం పూజలు నిర్వహించారు. శ్రావణమాసం ప్రారంభం కానున్న సందర్భంగా సమీప గ్రామాల ప్రజలు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పాడిపంటలు బాగా పండి, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు.